
సాక్షి మంచిర్యాల

మంగళవారం ; 15 ; ఆగస్టు ; 2023



నిలకడగా 'ఎల్లంపల్లి' నీటిమట్టం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. ఇన్‌ఫ్లో 5 వేల క్యూసెక్కులు ఉండగా, గేటు ఎత్తి 4వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

మంచిర్యాలఅగ్రికల్చర్: పంద్రాగస్టు సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 105మందిని సత్కరించనున్నారు. ఇందులో 101మంది జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు కాగా, మరో నలుగురిని ఇంటింటా ఇన్నోవేషన్ కింద పురస్కారానికి ఎంపిక చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకల్లో ముఖ్య అతిథి, ప్రభుత్వ విప్ సుమన్ ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /25.0

జిల్లాలో ఉదయం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు సీనియర్ సిటిజన్లకు బస్సుల్లో రాయితీ

మంచిర్యాలఅర్బన్: స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా టీఎస్ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరలు తగ్గించింది. ఆగస్టు 15న ఒకరోజు మాత్రం టికెట్‌పై 50 శాతం రాయితీ ప్రకటించింది. 60 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులకు రాయితీ వర్తిస్తుంది. ప్రయాణ సమయంలో వయస్సు ధ్రువీకరణకు ఆధార్‌కార్డును కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

కుష్ఠువ్యాధి అరికట్టేందుకు కృషి చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: సమాజంలో 2027 నాటికి కుష్ఠువ్యాధిని అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుష్ఠువ్యాధి నివారణ అవగాహన పోస్టర్లు, బ్యానర్లను డీఎంహెచ్‌వో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16నుంచి 31వరకు ఇంటింటికీ వెళ్లి ప్రతీరోజు ఆశా కార్యకర్తలు 25 ఇళ్లను సర్వే చేస్తారని తెలిపారు. శరీరంపై సహజ చర్మం రంగు కంటే తక్కువ గానీ, ఎరుపు రంగు గానీ, రాగిరంగు మచ్చలు ఉండి, మచ్చలపై స్పర్శ లేనట్లయితే కుష్ఠువ్యాధిగా అనుమానిస్తారని తెలిపారు. కుష్ఠువ్యాధి బహుళ ఔషధ చికిత్సతో 6 నుంచి 12 నెలల్లో నయమవుతుందని, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఫయాజ్‌ఖాన్, ఏ.శివకుమార్, రాఘవయ్య, బి.వెంకటేశ్వర్లు, రత్నమాల, డీపీవో ప్రశాంతి, శంకర్ పాల్గొన్నారు.

'డీలర్ల సమస్యలు పరిష్కరించిన ఘనత కేసీఆర్‌దే'

నస్పూర్: రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించిన ఘనత కేసీఆర్‌దేనని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో సీఎం కేసీఆర్‌కు జిల్లాలోని రేషన్‌డీలర్లు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కమీషన్ పెంపు, హెల్త్‌కార్డులు, బీమా కల్పన తదితర 13 సమస్యలు పరిష్కరించామని తెలిపారు. డీలర్లకు ప్రతీ క్వింటాల్‌కు రూ.70 కమీషన్‌ను రూ.140కి పెంచారని, రూ.5 లక్షల బీమా కల్పించారని తెలిపారు. డీలర్ల వయో పరిమితి 40ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై దుష్ప్రచారం'

బెల్లంపల్లి: రైతులను మోసం చేయడం కోసం ఆరిజిన్ డెయిరీ సీఈఓ శేజల్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ తెలిపారు. సోమవారం పాత బస్టాండ్ చౌరస్తా వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే చిన్నయ్యను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు శేజల్‌ను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. డెయిరీ పేరుతో రైతుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారని, మోసం చేసిన డెయిరీ నిర్వాహకులను పోలీసులకు పట్టించడంతోనే ఎమ్మెల్యేపై కక్ష కట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రామునాయక్, కొమ్ము సురేష్, కె.చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మధు, సత్యవతి, యాదగిరి పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షన్ కేంద్ర బృందం తనిఖీలు

తాండూర్: మండలంలో స్వచ్ఛ్ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కేంద్ర బృందం సభ్యులు చింతకింది రాకేష్, నవీన్ తాండూర్, కాసిపేట గ్రామ పంచాయతీల్లో పర్యటించి ఇళ్లలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలను పరిశీలించారు. మరుగుదొడ్ల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద నిర్మించిన ఇంకుడుగుంతలను పర్యవేక్షించారు. డంప్‌యార్డు, చెత్త సేకరణ, కాంపోస్టు తయారీ తదితర వాటిని పరిశీలించారు. ఆయా పనుల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ, శ్రీపతిబాబు, సర్పంచులు పూదరి నవీన్, అప్ప రమేష్, ఏపీవో నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు తపాస్‌కుమార్, సాయితేజ పాల్గొన్నారు.

అధినేత మదిలో ఎవరో!



- సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టికెట్లపై ఉత్కంఠ
- పలు చోట్ల మార్పులంటూ ప్రచారం
- బీఆర్ఎస్‌లో పెరుగుతున్న ఆశావహులు
- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మార్పు ఖాయం?



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గులాబీ అధినేత, సీఎం కేసీఆర్ మదిలో ఎవరెవరు ఉన్నారోనని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ నెలకొంది. పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో పలు అంశాలు తెరపైకి వస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సూచనప్రాయంగా తమకే టికెట్లు ఖరారైనట్లు చెప్పుకుంటున్నారు. కానీ ఇప్పటికీ అధికారికంగా జాబితా వెల్లడి కాలేదు. ఈ నెలలోనే మొదటి దఫా 70వరకు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లోనూ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తే ఇప్పుడున్న ఎమ్మెల్యేలందరికీ టికెట్లు వస్తాయా..? లేక ఏయే స్థానాల్లో మార్పులు ఉంటాయా అనే తర్జన భర్జన నడుస్తోంది. మెజార్టీ స్థానాల్లో పాత వారికే మళ్లీ టికెట్లు ఇస్తామని అప్పట్లో సీఎం ప్రకటించారు. ఎక్కడైనా ఎమ్మెల్యేలు సర్వేలో గ్రాఫ్ పడిపోవడం, ప్రజల నుంచి వ్యతిరేకత, ప్రత్యర్థి కంటే వెనుకబడిపోవడం వంటి కారణాలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేస్తామని పేర్కొన్నారు. ఆయా స్థానాల్లో కొత్తవారికి అవకాశాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మెజార్టీ స్థానాల్లో ఒకే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత ఎన్నికల్లో పది స్థానాల్లో ఆసిఫాబాద్ మినహా అన్ని చోట్ల బీఆర్ఎస్ జెండా ఎగురవేసింది. ఆ తర్వాత ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం పార్టీ మారడంతో ఉమ్మడి జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగింది. కొన్ని చోట్ల రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ బలపడడంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చి ఎలాగైనా మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న గులాబీ బాస్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యతిరేకత ఉన్న వారి మార్పు ఖాయంగా వినిపిస్తోంది.

ఎక్కడెక్కడ మార్పు?

ఉమ్మడి జిల్లాలో ఆరు నుంచి ఏడు అసెంబ్లీ స్థానాల్లో దాదాపు పాత వారికే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇందులో సిర్పూర్, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ముథోల్, చెన్నూరులో అభ్యర్థులకు ఢోకా లేనట్లు ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, ఖానాపూర్, బోథ్ స్థానాలపై ఊగిసలాట కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ స్థానాల్లో మార్పులు ఉంటాయా? కొత్త వారికి అవకాశాలు ఉంటాయా? అనేది తేలాల్సి ఉంది.

ఆశావహుల ఆరాటం

ఎక్కడైనా సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చితే తమను పరిశీలనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్‌లోనే అనేక మంది బీ ఫామ్ కోసం వరుసలో ఉన్నారు. అధిష్టానం దృష్టిలో పడేందుకు, ప్రజల్లో తమ బలం పెంచుకునేందుకు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి తామే ఎమ్మెల్యే అభ్యర్థులం అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు.

చివరి వరకు టెన్షన్ ?

మార్పులు చేసే చోట్ల ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి ఉంటే ఆ ఎమ్మెల్యేలకు చివరి క్షణం వరకు టెన్షన్ తప్పేలా లేదు. మొదటి జాబితాలో ఉన్న వారు ఉత్సాహంగా ప్రచారంలోకి దిగితే సీట్లు మార్చే చోట అందుకు భిన్నంగా ఉండనుంది. 'ఒక వేళ ఈలోపు రాష్ట్ర, జిల్లా సమీకరణలు మారితే అందరికీ టికెట్లు వచ్చినా ఆశ్చర్యం లేదు' అని సీనియర్ నాయకుడు ఒకరు అభిప్రాయం వ్యక్తం చేశారు. అభ్యర్థులను మార్చితే అందుకు తగిన వారుంటేనే పార్టీకి లాభం లేకపోతే ఇతరులు లబ్ధి పొందే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో అధినేత మనసులో ఏముందోనని జాబితా వెలువడే వరకు పార్టీ శ్రేణుల్లో చర్చ మాత్రం జోరుగా సాగుతోంది.

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు



వేడుకలకు సిద్ధమైన బాలుర పాఠశాల గ్రౌండ్

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వాతంత్య్ర వేడుకలకు జిల్లా కేంద్రం ముస్తాబైంది. కలెక్టరేట్, పోలీసు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో వేడుకలకు సిద్ధం చేశారు. పోలీసు కవాతు, గౌరవ వందనం స్వీకరణ, శకటాల ప్రదర్శన, స్టాల్స్, జిల్లాలో సాధించిన పలు అభివృద్ధి ప్రగతి నివేదిక ప్రసంగం, సభావేదిక టెంట్లు ఏర్పాటు చేశారు. సోమవారం కురిసిన వర్షంతో మైదానం కొంత చిత్తడిగా మారడంతో ఏర్పాట్లకు ఇబ్బందిగా కలుగుతోంది. ఇసుక, మట్టి పోసి ట్రాక్టర్‌తో మరమ్మతులు చేపట్టారు.

11గంటలకు పతాకావిష్కరణ

మంగళవారం ఉదయం 11గంటలకు జాతీయ పతాకాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రగతి సందేశం, స్వాతంత్య్ర సమరయోధుల సన్మానం, శకటాల ప్రదర్శన, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత తదితర కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ సంతోష్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం విప్ సుమన్‌కు జర్నలిస్టుల వినతి



విప్ సుమన్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పాతమంచిర్యాల: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా శాఖ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతోపాటు గృహలక్ష్మి పథకం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రంతోపాటు మున్సిపాలిటీల్లో జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. కలెక్టరేట్‌లో మీడియా పాయింట్ కోసం గదిని కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, కార్యదర్శులు పింగళి సంపత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపిరెడ్డి ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి కౌట్టి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు రాములు, సురేష్‌లతో కలిసి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని అన్నారు. వృద్ధాప్య, వికలాంగుల పింఛన్ కోసం పలువురు అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం లంబాడితండా గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని గుగ్లోత్ భీమానాయక్ కోరారు. సింగరేణి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని రామకృష్ణాపూర్‌కు చెందిన కలవల తిరుపతి ఫిర్యాదు చేశాడు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని 5వ వార్డు గర్మిళ్ల శివారు శ్రీశ్రీనగర్‌లోని అసైన్డ్ భూమిలో అక్రమ కట్టడాలు చేస్తున్నారంటూ పలు సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వేనంబర్ 483లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిని ఆ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు తప్పుడు సర్వేనంబర్ 484 పట్టా భూమిగా చూపించి, అనుమతి లేకుండానే నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఎస్‌కె.సల్మాన్ పాషా, తెలంగాణ జనసమితి నాయకులు బచ్చలి ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పి.శ్రీనివాస్, శివకుమార్, మాల సంఘం నాయకులు కిరణ్ పాల్గొన్నారు.

'మంచి మంచిర్యాల' ఎక్కడ..?



ఐబీ చౌరస్తాలోని మంచి మంచిర్యాలకు అడ్డుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని ఐబీ చౌరస్తాలో రూ.25 లక్షల వ్యయంతో సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన 'మంచి మంచిర్యాల' సెల్ఫీ పాయింట్ గత కొద్ది రోజులుగా కనిపించడం లేదు. పుట్టిన రోజులు, ఏవైనా కార్యక్రమాలు చేపట్టినా మున్సిపల్ అనుమతి తీసుకోకుండానే ఇష్టారీతిన చౌరస్తాలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రోజుల తరబడి ఆయా ఫ్లెక్సీలు ఉంచడంతో 'మంచి మంచిర్యాల' సెల్ఫీ పాయింట్ కనిపించకుండా పోతోంది. గత ఏడాది రూ.26.50లక్షలతో సెల్ఫీ పాయింట్ వెనకాలే 150 ఫీట్లతో జాతీయ జెండా ఏర్పాటు చేశారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటుంటే దేశ కీర్తిని చాటేలా ఏర్పాటు చేసిన జాతీయ జెండాకు సమీపంలోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా కనీసం వాటిని తొలగించడంలోనూ మున్సిపల్ అధికారులు అశ్రద్ధ చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సృజనాత్మకతకు ఇంటింటా ఇన్నోవేటర్ దోహదం



మోటారుతో నడిచే సైకిల్‌తో వినయ్‌కుమార్



ప్రాజెక్టర్‌తో ఎండీ మక్సూద్

నస్పూర్: ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాల వెలికితీతకు ఇంటింటా ఇన్నోవేటర్ ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మందమర్రి ప్రాంతానికి చెందిన కటకం వినయ్‌కుమార్ మోటారుతో నడిచే సైకిల్, తాండూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కటకం వినయ్‌కుమార్, ఎండి.మక్సూద్ అతి తక్కువ ఖర్చుతో ప్రాజెక్టర్ రూపొందించారని తెలిపారు. ఆవిష్కరణలను స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించి ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రిన్సిపాల్

నస్పూర్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జే.ప్రసాద్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

గడువులోగా పరిశీలన పూర్తయ్యేనా..?

- జిల్లాలో 50,501 గృహలక్ష్మి దరఖాస్తులు
- ఈ నెల 20 వరకు పరిశీలనకు గడువు
- స్థానిక ప్రజాప్రతినిధుల చెప్పిన వారికే ఓకే
- జిల్లాలో మొదటగా 9,400 మందికి..



మంచిర్యాలలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలో గృహలక్ష్మి పథకానికి 50,501మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంటిస్థలం ఉండి ఇల్లు లేని పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నెల ఏడు నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ నియోజకవర్గానికి మూడు వేల చొప్పున అర్హులకు మొదటి విడతలో భాగంగా గృహలక్ష్మి పథకం మంజూరు చేయనుండగా, జిల్లాలో మూడు నియోజకవర్గాలతోపాటు, ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలం కలిపి 9,400 మందిని ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఏడు మున్సిపాలిటీలు, 15 మండలాల్లో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయి పరిశీలిస్తున్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉండడం, 20వ తేదీ వరకు ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అనర్హులెవరనేది గుర్తించాల్సి ఉంది.

ప్రజాప్రతినిధులు చెబితే ఓకే..?

అర్హుల ఎంపిక కోసం చేస్తున్న పరిశీలనలో స్థానిక ప్రజాప్రతినిధులు చెబితే, అనర్హులైన వారిని అర్హులుగా చేరుస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా అధికార పార్టీకి చెందిన వారు చెప్పిన వారందరినీ అర్హులుగా పేర్కొంటుండగా, ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట మాత్రం క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులను గుర్తిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండడంతో తమ వారికే గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలనే ఒత్తిడి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లపై పడుతోంది. ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడి ఓ వైపు, వేలాదిగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు గడువు తక్కువగా ఉండడంతో పరిశీలన నామమాత్రంగా చేపడుతున్నట్లుగా తెలుస్తోంది.

మండలాల వారీగా దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
బెల్లంపల్లి	2,498
భీమిని	2,189
కన్నెపల్లి	2,808
కాసిపేట	2,571
నెన్నెల	2,242
తాండూరు	3,183
వేమనపల్లి	2,261
చెన్నూరు	3,740
కోటపల్లి	4,199
భీమారం	1,884
జైపూర్	2,231
మందమర్రి	1,017
హాజీపూర్	1,844
లక్సెట్టిపేట	1,557
దండేపల్లి	2,887
మున్సిపాలిటీల వారీగా	
మంచిర్యాల	1,605
లక్సెట్టిపేట	1,178
నస్పూర్	1,120
క్యాతన్‌పల్లి	536
మందమర్రి	1,021
చెన్నూరు	1,457
బెల్లంపల్లి	2,839
మొత్తం	50,501

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం


- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- రూ.లక్ష సాయం చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న సుమన్, కలెక్టర్ సంతోష్

నస్పూర్: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో 3084 మంది దరఖాస్తు చేసుకోగా 2448 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు. మొదటి విడత 300 మందికి చెక్కులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక చాలా పారదర్శకంగా చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. తుంతుంగ, సుద్దాల, కిష్టంపేట, గంగారం, రసూల్‌పల్లి, బొక్కలగుట్ట, సుబ్బారాంపల్లి బ్రిడ్జిలను త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. రూ.500 కోట్లతో ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

దాడులపై చర్యలు తీసుకోవాలలి



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం, సమతాసైనిక్‌దళ్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, బహుజన ఐక్యవేదిక నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో డీసీపీ రాంనాథ్ కేకన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోటపల్లి మండలం శెట్‌పల్లికి చెందిన దళితుడిపై దాడి, మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన దళితుడిపై హత్యాయత్నం సంఘటనలు ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సమతాసైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధార్థ రామ్మూర్తి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, దళిత బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పలిగిరి కనకరాజు, నాయకులు రాజేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి హమాలీ మృతి

చెన్నూర్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ట్రాక్టర్ కిందపడి హమాలీ కార్మికుడు మృతి చెందినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. లంబాడిపల్లి గ్రామానికి చెందిన నాగవత్ దేవానాయక్ (55) చెన్నూర్‌లోని మారుతి హార్డ్ వేర్ షాపులో హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం దుకాణంలో నుంచి ట్రాక్టర్‌లో సిమెంట్ సంచులు వేసుకుని బైపాస్ రోడ్డులో గల సాయిరాం ఫంక్షన్ హాల్ వైపు వెళ్తుండగా డ్రైవర్ మద్ది మల్లయ్య అజాగ్రత్తగా నడపడంతో ట్రాక్టర్‌పై కూర్చున్న దేవానాయక్ ట్రాలీ వెనుక టైర్ కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతుని కుమారుడు రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ మద్ది మల్లయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ సైనికుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

మంచిర్యాలక్రైం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో సోమవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వెంకటేశ్వర టాకీస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై జగదీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో సైనికులు అమరులయ్యారని వారి త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భాస్కర్ బాల్నే, కోశాధికారి డీబీ చారి, సుభాష్ చంద్రబోస్, రుస్తుంఅలీ, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ జోబీస్ జార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరిన నారుతో జాగ్రత్త

- నాట్లు ఆలస్యమైతే పంట దిగుబడిపై ప్రభావం
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి
- జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు జిల్లాలోని రైతులు వరి నారుమడులు సిద్ధం చేశారు. కానీ పదిహేను రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో నాట్లు ఆలస్యం కానున్నాయి. దీంతో రైతులు వర్షాలకోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో వరిపంట సాగవుతుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 1.27 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు నాట్లు వేయని రైతులు నారు ముదిరిపోతోందని ఆందోళన చెందుతున్నారు. ముదిరిన నారుతో నాట్లు వేయడం ఎలా? తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెన్నూర్ ఏడీఏ జాడి బాపు వివరించారు.


వరి నారు తీస్తున్న మహిళలు

జాడి బాపు

ముదిరిన నారు ఎలా నాటుకోవాలి?

ముదిరిన వరినారుతో నాటువేస్తే పంట దిగుబడి తగ్గుతుంది. నాటు పైపైన నాటితే పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాటు వేసిన తర్వాత ప్రతీ రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలి బాటలు తీయాలి. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్య పెంచి కుదురుకు 4 నుంచి 5 మొక్కల చొప్పున నాటాలి. కుదుళ్లను దగ్గరగా నాటుకోవాలి. సిఫార్సు కంటే 25 శాతం పెంచి రెండు దఫాలుగా 70 శాతం దమ్ములో 30 శాతం అంకురం దశలో వేయాలి. 2 బస్తాల యూరియా, బస్తా డీఏపీ, బస్తా పొటాష్‌ను మూడు భాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ము దశలో, అంకురం దశలో బురద పదునులో మాత్రమే సమానంగా చల్లాలి. రెండు రోజుల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. డీఏపీ ఎరువును దమ్ములోనే వేయాలి. పొటాష్‌ను ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా సగాన్ని వేయాలి. జింకు లోపాన్ని నివారించేందుకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ చొప్పున కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువుతో జింక్ సల్ఫేట్ కలిపి వేయరాదు.

పురుగుల నివారణ

వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల ద్రావణం లేదా సోనామిడాన్ 2 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్టదశలో కార్బోఫ్యూరాన్ 3 కిలోల గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున చల్లుకోవాలి.

దోమల నివారణ

వరిలో దోమల నివారణకు కాలిబాటలు వదలాలి. క్లోరిఫైరిపాస్ 2 మిల్లీలీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తాటాకు తెగులు నివారణకు రెండు మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇలాంటి పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

నస్పూర్: పట్టణ శివారులోని 64సర్వేనంబరులో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 19గుంటల భూమి కబ్జా చేసి చుట్టూ తాత్కాలిక ప్రహరీ నిర్మించారు. సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్, పీహెచ్‌సీకి మధ్య ఉన్న ఈ భూమి రూ.కోట్ల ధర పలుకుతోంది. అధికారులు అందుబాటులో ఉండరని ప్రభుత్వ సెలవు రోజుల్లోనే కబ్జా చేస్తున్నారు. ఈ కబ్జా వ్యవహారంలో సింగాపూర్ గ్రామ పంచాయతీలో కీలక పదవి అనుభవించిన ఓ మాజీ ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్‌ను సంప్రదించగా.. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన తాత్కాలిక ప్రహరీ

ప్రజావాణిలో ఫిర్యాదు..

64 సర్వే నంబరులోని భూమిలో గతంలో ఆటోనగర్‌కు కేటాయించారని తాళ్లపల్లి సర్పంచ్ జక్కుల రాజేశం, ఆయుర్వేదిక్ ఆసుపత్రి భవన నిర్మాణానికి 4 గుంటలు కేటాయించారని, దానిని కొందరు ఆక్రమించారని ఆయుర్వేదిక్ ఆసుపత్రి సిబ్బంది సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు ఫిర్యాదు చేశారు.

సెప్టెంబర్ వేతనంతో ఏరియర్స్ చెల్లించాలి

కాసిపేట(బెల్లంపల్లి): 11వ వేజ్‌బోర్డు, 23 నెలల ఏరియర్స్ సెప్టెంబర్ నెల వేతనంతో చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట–2 గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఆయా గనుల మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. కోలిండియాలో ఆగస్టు నెలతో ఇవ్వనుండగా సింగరేణిలో ఇంత వరకు సర్క్యులర్ జారీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, కాసిపేట పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు రాజేందర్, లింగయ్య, శ్రీనివాస్, రఘురాం, కాసిపేట–2 పిట్ కార్యదర్శి శ్రీనివాస్, శ్రీధర్, రత్నం, ఐలయ్య పాల్గొన్నారు.

వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలి

నస్పూర్: 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన ఏరియర్స్ చెల్లించాలని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి ఆర్‌కే 7 గనిపై ధర్నా నిర్వహించారు. అనంతరం గని ఎస్‌వో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గని పిట్ సెక్రెటరీ ప్రతాప్, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి రాజేందర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గనులపై ఏఐటీయూసీ ధర్నా

రామకృష్ణాపూర్(చెన్నూర్): 11వ వేజ్‌బోర్డు తాలూకు 23నెలల ఏరియర్స్ ఆగస్టు నెల వేతనంతో చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ గ్రూప్ గనులు, డిపార్ట్‌మెంట్లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంస్థ లాభాల్లో నడుస్తున్నా సింగరేణి యాజమాన్యం ఏరియర్స్ చెల్లింపులో ఎందుకు జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, నాయకులు సురమల్ల వినయ్, ఆంజనేయులు, రాజేశ్వర్‌రావు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చదువు ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్య


శ్రావ్య (ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): చదువుకోవడం ఇష్టంలేక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన బూసారపు శ్రీనివాస్ కుమార్తె శ్రావ్య (17) లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆమెకు చదువుపట్ల శ్రద్ధ లేకపోవడంతో కొద్దిరోజులుగా కళాశాలకు సరిగా వెళ్లడంలేదు. తల్లిదండ్రులు నచ్చజెప్పి పంపించినా మళ్లీ మూడురోజులుగా ఇంటివద్దే ఉంటోంది. తండ్రి శ్రీనివాస్ మందలించడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన తల్లి దండ్రులు ముందుగా లక్సెట్టిపేటకు, అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మే రకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీలో జరిగిన ఓ హత్య కేసులో సోమవారం పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం హన్మాన్‌బస్తీకి చెందిన సత్తయ్య పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో కుటుంబం పరువు తీస్తున్నాడని అతని కుమారుడు అనుదీప్ జూన్ 28న ఇనుపరాడుతో తలపై బాదడంతో మృతి చెందాడు. అప్పటి నుండి నిందితుడు పరారీలో ఉండగా పక్కా సమాచారంతో పోస్టాఫీసు వద్ద పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు. ఈమేరకు న్యాయమూర్తి నిందితుడికి రిమాండ్ విధించారు.

చెరువులోపడి ఒకరు మృతి

కాసిపేట(బెల్లంపల్లి): ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోనూరు తంగళ్లపల్లికి చెందిన కొడిమల పోశం (32) తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో మూడేళ్లక్రితం అతని భార్య లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో అతని తల్లి బుచ్చక్క, సోదరుడు వెతికేందుకు వెళ్లగా వారిని గమనించిన పోశం చెరువుకట్టపై చెట్లపొదల్లో దాక్కున్నాడు. అతని వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గాంధీనగర్‌కు చెందిన ఆర్ముగం నాగరాణి(31) భర్త రాము కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఆదివారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన మహిళ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాము సోదరుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గోల్కొండకోటకు గుస్సాడీ బృందం


బయలుదేరిన కనక రాజు బృందం

నార్నూర్(జైనూర్): హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు జైనూర్ మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ బృందం కళాకారులు సోమవారం హైదరాబాద్ బయలు దేరారు. ఈ సందర్భంగా బృందం ఇన్‌చార్జి కనక సుదర్శన్ మాట్లాడుతూ వేడుకల్లో పాల్గొని ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రదర్శన రూపంలో తెలియజేస్తామన్నారు.

లైంగిక వేధింపులపై విచారణ

- ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తా
- మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడు పార్థిరాం లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై విచారణ జరుగుతున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి తెలిపారు. సోమవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో పాటు హాస్టల్ సిబ్బందిని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులు ఉండకూడదని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె దృష్టికి తీసుకురాగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు. ఆమె వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్, ఐటీడీఏ డైరెక్టర్ మాంతయ్య, కాగజ్‌నగర్ ఏటీడీవో ఖమర్ హుస్సేన్, జెడ్పీటీసీ పుష్పలత, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఈశ్వరీబాయి

హెచ్‌ఎంపై పోక్సో కేసు

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్థిరాంపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రమ్ తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

నస్పూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పెండెం శివకుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శివకుమార్‌ను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల్లో నుండి తొలగించారని, విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల కుమార్, గట్టు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలు విజయవంతం చేయాలి'


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

జైపూర్(చెన్నూర్): ఈ నెల 25, 26, 27 తేదీల్లో గోదావరిఖనిలో జరుగనున్న ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై సోమవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తాండూర్‌లో సినిమా చిత్రీకరణ

తాండూర్: మండలంలోని రేచిని గ్రామానికి చెందిన ఏకారి సత్యనారాయణ నిర్మాతగా భాస్కర్ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఓ సినిమా సన్నివేశాలను సోమవారం మండల కేంద్రంలో చిత్రీకరించారు. ఐబీ ప్రాంతంలో దసరా ఫిలీం ఫేమ్ గడ్డం సురేష్, కుట్ర సినీ ఫేమ్ సిరిపురం రాజేశ్‌పై కొన్ని సన్నివేశాలు తీశారు. ప్రతిభావంతులైన స్థానిక కళాకారులకు చిత్రంలో అవకాశం కల్పిస్తున్నట్లు నిర్మాత ఏకారి సత్యనారాయణ తెలిపారు.


సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు